
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 23 । జనవరి । 2024



ఊరూరా ఆధ్యాత్మిక సంబరం

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఊరూవాడా రామనామ స్మరణతో మార్మోగింది. 10లో ▸



మన్యంలో పులి సంచారం?

కోటరామచంద్రాపురం ఐటీడీఏ సమీపంలో ఎర్రాయిగూడెం రహదారిలో చెరువు వద్ద పులి పాదముద్రలను గ్రామస్తులు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చారు. 10లో ▸



రాజమండ్రికి శ్రీవారి రథం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ధర్మప్రచార రథం రాజమహేంద్రవరంలో సీతారాముల కల్యాణ వేడుక నిమిత్తం సోమవారం తరలి వెళ్లింది.

అతివలకు ఆసరా

నేడు నాలుగో విడత రుణమాఫీ

- జిల్లాలో 27,038 డ్వాక్రా సంఘాలకు రూ.276.52 కోట్ల లబ్ధి
- గత మూడు విడతల్లో మాఫీ చేసిన మొత్తం రూ.829.56 కోట్లు
- 31,943 సంఘాలకు రూ.220 కోట్ల మేర సున్నా వడ్డీ రాయితీ
- నాడు రుణమాఫీ చేస్తానని మహిళలను వంచించిన చంద్రబాబు
- పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు



పాలకోడేరు మండలం మోగల్లులో సమావేశమైన డ్వాక్రా సంఘం మహిళలు

సాక్షి, భీమవరం: ఎన్నికల నాటికి జిల్లాలోని 27,037 డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.1,106 కోట్ల రుణాలు ఉన్నట్టు మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు గుర్తించారు. నాలుగు విడతలకు గాను గత మూడేళ్లలో రూ.276.52 కోట్లు డ్వాక్రా సంఘాల ఖాతాలకు రుణ మాఫీ సొమ్మును ప్రభుత్వం జమ చేస్తూ వస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో రూ.829.56 కోట్లు రుణ మాఫీ చేయగా మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి నాలుగో విడత రుణమాఫీ నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్వాక్రా మహిళల బయోమెట్రిక్ నమోదు ప్రక్రియను ఇప్పటికే యానిమేటర్లు పూర్తి చేశారు. మండలాల వారీగా ఈనెలాఖరు వరకు జరిగే ఆసరా వేడుకల్లో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సొమ్ములు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నాడు

'డ్వాక్రా సంఘాల రుణాలన్నింటినీ అధికారంలోకి రాగానే మాఫీ చేస్తాం. లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తాం.'

– 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ.

మహిళలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మాటమార్చారు. రుణమాఫీ చేయలేమంటూ చేతులెత్తేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు పసుపు కుంకుమ అంటూ డ్వాక్రా మహిళలకు రూ.10 వేల పోస్టు డేటెడ్ చెక్కులు ఇచ్చి మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. చంద్రబాబు మాటలు నమ్మి రుణాలు చెల్లించకపోవడంతో అప్పులపై వడ్డీ భారం పెరిగి అధిక శాతం సంఘాలు వడ్డీ రాయితీకి దూరమయ్యాయి. పాత బకాయిలు పేరుకుపోయాయంటూ బ్యాంకులు కొన్నిచోట్ల బాకీగా పొదుపు ఖాతాల్లోని సొమ్మును వడ్డీలకు జమచేసుకున్నాయి. బాకీలు చెల్లించాలంటూ బ్యాంకు సిబ్బంది నోటీసులు, ఒత్తిళ్లతో డ్వాక్రా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు డ్వాక్రా సంఘాలు అధోగతి పాలయ్యాయి.

నేడు

'ఎన్నికల రోజు వరకు అక్కాచెల్లెమ్మలు తీసుకున్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తాం. సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తాం. వడ్డీ పూర్తిగా మన ప్రభుత్వమే కడుతుంది.'

– 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ.

సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లోనే రుణమాఫీ హామీని అమలులోకి తెచ్చారు వైఎస్ జగన్. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకు లింకేజీ ద్వారా డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో మాఫీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ చేయగా చివరి నాలుగో విడతగా మంగళవారం డ్వాక్రా సంఘాల ఖాతాలకు నగదు జమ చేయనున్నారు. మాట ఇచ్చినట్టుగానే వడ్డీ రాయితీ హామీని క్రమం తప్పకుండా అమలు చేశారు. గత నాలుగేళ్లలో 31,943 సంఘాలకు రూ.220 కోట్లు సున్నా వడ్డీ రాయితీని అందజేశారు. 1,051,69 డ్వాక్రా సభ్యులకు రూ.498.07 కోట్లు స్త్రీనిధి రుణాలను అందించారు.

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ ఆసరా లబ్ధి వివరాలు

నియోజకవర్గం	భీమవరం	ఆచంట	నరసాపురం	ఉండి	తాడేపల్లిగూడెం	తణుకు	పాలకొల్లు	గణపవరం మండలం
సంఘాలు	2,924	3,701	3,150	5,239	2,900	4,147	3,839	1,138
రుణమాఫీ చేసిన మొత్తం (రూ. కోట్లలో)	115.8	148.08	132.08	251.04	101.12	166	154.48	37.36

బాబు వల్ల మోసపోయాం



అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానన్న చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయాం. చంద్రబాబు డ్వాక్రా బకాయిలు చెల్లించక రుణభారం పెరిగిపోయింది. బాకీలు చెల్లించాలని బ్యాంకు అధికారులు డ్వాక్రా మహిళలను వేధించేవారు.

– గల్లి కనకదుర్గ, ఆకివీడు

చెప్పినట్టే రుణం మాఫీ చేశారు



మాది కరుణ డ్వాక్రా సంఘం. ఎన్నికలు జరిగే నాటికి మా గ్రూప్‌నకు రూ.7,20,000 రుణం ఉంది. ఎన్నికల్లో మాట ఇచ్చినట్టుగానే జగనన్న రుణమాఫీ హామీని అమలు చేస్తూ వచ్చారు. ఒక్కో విడతలో సభ్యులు ఒక్కొక్కరికి రూ.18 వేల చొప్పున మొత్తం రుణం మాఫీ చేశారు.

– చంద్రు కల్యాణి, వేల్పూరు, తణుకు మండలం

పచారీ షాపు ప్రారంభించా



గతంలో కూలి పని చేసుకునే ఇల్లు గడుపుకునే వాళ్లం. జగనన్న వచ్చాక వైఎస్సార్ ఆసరా పథకం కింద రుణ మాఫీ చేసిన సొమ్ములతో సొంతంగా చిన్న పచారీ షాపు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాను. ఇప్పటికి మూడు విడతల్లో రూ.41,100 రుణం మాఫీ అయ్యింది.

– చింతపల్లి కుమారి, మోగల్లు, పాలకోడేరు మండలం

రూ.6 లక్షల రుణమాఫీ చేశారు



మా హెర్మోన్ డ్వాక్రా సంఘానికి రూ.6 లక్షల రుణమాఫీ అయ్యింది. ఒక్కో సభ్యురాలికి రూ.60 వేలు చొప్పున లబ్ధి చేకూరింది. గతంలో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేస్తే సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మా రుణాలను మాఫీ చేశారు.

– పువ్వుకాయల శాంతకుమారి, పెదమామిడిపల్లి, పాలకొల్లు మండలం

ఏర్పాట్లు పూర్తి



వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ సొమ్ము జమ చేసేందుకు అంతా సిద్ధమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల బయోమెట్రిక్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. వారం రోజుల పాటు జిల్లాలోని మండలాల్లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశాం.

– శివప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ

న్యూస్‌రీల్

స్పందన బాధితులకు సత్వర న్యాయం



మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు చేపట్టామని స్పందనలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను సకాలంలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఎస్పీ డీ. మేరిప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావినతుల వేదిక స్పందనలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పలు సమస్యలపై వెంటనే సంబంధిత పోలీస్ సిబ్బందికి ఫోన్ చేసి వాటి పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదులలో కొన్ని..

ఏలూరు రూరల్ పరిధిలోని మాదేపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళ తనకు 2008లో వివాహమైందని, అప్పటి నుంచి భర్త, ఆడపడుచులు వేధింపులకు గురి చేస్తున్నారని, తాను గర్భవతిగా ఉండగా కొట్టడంతో గర్భస్రావమైందని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.86 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఏలూరు వన్‌టౌన్‌కు చెందిన ఓ వ్యక్తి కోరారు. ఆగిరిపల్లి మండలం నెక్కలపూడి గ్రామానికి చెందిన వ్యక్తి తాను గ్రామంలో రూ.10 లక్షల చీటీలు వేశానని, మొత్తం 18 మంది సభ్యులుండగా రూ.60 వేలు నెలకు చెల్లించేలా నిర్ణయించి డబ్బులు కట్టామని చీటీ పూర్తయినా ఇప్పటివరకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని చర్యలు తీసుకోవాలని కోరారు.

24న జీలుగుమిల్లిలో 'జగనన్నకు చెబుదాం'

ఏలూరు (మెట్రో): ప్రతి బుధ, శుక్రవారం మండల స్థాయిలో జేకేసీ గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా జీలుగుమిల్లిలో ఈనెల 24వ తేదీ జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు అందరూ హాజరై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల ప్రజలు తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక



కొత్తపల్లి వినోద్‌కుమార్

దెందులూరు: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌లో యోగాసనాలు ప్రదర్శించేందుకు ఏలూరు జిల్లా దెందులూరు వాసి కొత్తపల్లి వినోద్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాధిక్‌ఖాన్ నుంచి లిఖితపూర్వక ఆదేశాలు అందాయి. ఆయుష్మాన్ భారత్, ఆయుష్ వెల్‌నెస్ సెంటర్లల్లో భాగంగా దెందులూరు నియోజకవర్గంలో కొప్పాక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకుడిగా కొత్తపల్లి వినోద్ పనిచేస్తున్నారు.

నేడు ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కార్యాలయం, ఏపీ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, ప్రభుత్వ ఐటీఐ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాకు యువత నేరుగా హాజరు కావాలన్నారు. హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ (హైదరాబాద్)లో జూనియర్ కెమిస్ట్ (పురుషులు) పోస్టులకు బీఎస్సీ (కెమిస్ట్రీ), బికాం, బీఏ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. జూనియర్ ఆఫీసర్స్ పోస్టులకు ఎంఎస్సీ (కెమిస్ట్రీ), బి.ఫార్మసీ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. మెయింటెనెన్స్ (పురుషులు) పోస్టులకు సంబంధించి ఐటీఐ ఫిట్టర్/డిప్లొమా (మెకానికల్, కెమికల్) చదివినవారు అర్హులుగా పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18–26 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. టాటా మోటార్స్ (జాస్పర్)లో డీజిల్ మెకానిక్స్ (పురుషులు–2), జనరల్ మెకానిక్స్ (పురుషులు–20), ఎలక్ట్రిషియన్స్ (పురుషులు–5) పోస్టులు ఉన్నాయన్నారు. ఐటీఐ చదివి, 18–40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్(పురుషులు–10) పోస్టులు ఉన్నాయని, డిగ్రీ చదివి, 18–40 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులుగా తెలిపారు. ఇతర వివరాలకు 88868 82032 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్పందన ఫిర్యాదులపై న్యాయం చేయాలి



ఓ మహిళ అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం: పోలీసు స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై సత్వరం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ యు. రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రవిప్రకాష్, ఏఎస్పీ వి.భీమారావు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ఎనిమిది ఫిర్యాదులు అందగా, వాటిలో పాలకోడేరు గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు లేదని, తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరింది. అదేవిధంగా వ్యాపారంలో రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టగా తనను మోసం చేశాడని పాలకోడేరుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. యలమంచిలికి చెందిన ఓ మహిళ తన భర్తను ఏజెంట్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు పంపించాడని, అయితే అక్కడికి వెళ్లిన తరువాత అది విజిటర్ వీసా అని తెలిసి మోసపోయామని, ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ రవిప్రకాష్ ఫోన్‌లో ఆదేశించారు.

మహిళా ఓటర్లదే పైచేయి

- విడుదలైన ఓటర్ల తుది జాబితా
- గతం కంటే 7.2 శాతం పెరిగిన ఓట్లు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 14,61,338
- పురుషులు 7,16,956, మహిళలు 7,44,308, ఇతరులు 74
- అత్యధికంగా భీమవరం, అత్యల్పంగా నరసాపురంలో..



కలెక్టరేట్‌లో రాజకీయ నాయకులు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: 2024 సార్వత్రిక సమరానికి సన్నద్ధం చేస్తూ ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని 1,471 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 14,61,338 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 7,16,956, మహిళలు 7,44,308, ఇతరులు 74 మంది ఉన్నారు. పురుషలతో పోలిస్తే 27,352 ఓట్లతో మహిళలదే పైచేయిగా ఉంది. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల్లో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 15 నుంచి ఈసీ స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 చేపట్టింది. అక్టోబర్ 28న ముసాయిదా జాబితా విడుదల చేసింది. జనవరి 5న తుది జాబితా ప్రచురించాల్సి ఉండగా, ఎన్నికల ఏడాది కావడంతో కొత్త ఓటర్ల నమోదుకు జనవరి 12 వరకు ఈసీ గడువు పొడిగిస్తూ వచ్చింది. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పనిచేసింది.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన

సీప్ కార్యక్రమం ద్వారా ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా 18 ఏళ్లు నిండిన 31,819 మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించారు. ఓటింగ్ ప్రక్రియకు దూరంగా ఉండే 80 ఏళ్లు దాటిన వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లు అందరిని పూర్తి ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపారు. అలాగే దివ్యాంగులకు సంబంధించి ఓటు నమోదుకు చర్యలు తీసుకున్నారు. తాజా జాబితాలో పీడబ్ల్యూడీ ఓటర్లు మొత్తం 20,132 మంది ఉన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ చనిపోయిన, డూప్లికేట్ ఓట్లను తొలగించారు. ఒకే డోర్ నంబర్‌లో 10కి పైగా ఉన్న ఓట్లు విషయంలో ఈసీ మార్గదర్శకాలు మేరకు సరిచేశారు. ఓటరు జాబితాలో సవరణలు, అడ్రస్ మార్పులు తదితర ప్రక్రియలన్నింటిని పూర్తి చేశారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రగతిని వివరిస్తూ పారదర్శకంగా జాబితాలను సిద్ధం చేశారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలింగ్‌స్టేషన్లు
భీమవరం	1,22,228	1,29,023	50	235
ఆచంట	88,319	90,348	01	187
పాలకొల్లు	95,079	98,293	07	190
నరసాపురం	83,745	84,442	0	169
ఉండి	1,09,414	1,13,583	02	248
తణుకు	1,13,780	1,19,296	08	233
తాడేపల్లిగూడెం	1,04,391	1,09,323	08	209



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం సమావేశమై తుది ఓటర్ల జాబితాను వివరించారు. కలెక్టరేట్‌తో పాటు, తహసీల్దార్ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో తుది ఓటర్ల జాబితాలను ప్రచురించారు. జిల్లాలో భీమవరం నియోజకవర్గంలో అత్యధికంగా 2,51,301 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా నరసాపురం నియోజకవర్గంలో 1,68,187 మంది ఓటర్లు ఉన్నారు.

7.2 శాతం ఓట్లు పెరుగుదల

గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో 7.2 శాతం మేర ఓటర్ల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోంది. 2019 ఎన్నికల నాటికి జిల్లాలో 13,62,654 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 14,61,338కు పెరిగింది. తాజా జాబితాలో 98,684 ఓట్లు పెరిగాయి.

అభ్యంతరాలుంటే దరఖాస్తు చేయవచ్చు

తుది జాబితాను ప్రచురణ అనంతరం కూడా ఏమైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే దరఖాస్తుచేసుకోవచ్చు. వాటిని విదారించి నిబంధనలు ప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఉద్దేశ్య పూర్వకంగా, లేదా తప్పుడు సమాచారం ద్వారా అభ్యంతరాలు దాఖలు చేస్తే వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– పి.ప్రశాంతి, కలెక్టర్

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను డీఆర్వో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీఓపెన్ అవ్వని విధంగా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వంపై నమ్మకంతో సమస్యల పరిష్కారం కోసం వస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన చక్కని పరిష్కారం అర్జీదారులకు చూపాలని అధికారులకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా 146 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎస్వీఎస్ ప్రసాద యాదవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ అప్పిలేటు మెంబరు మేళం దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

గ్రామ జల సంఘాలకు వర్క్ ఆర్డర్ ఇవ్వండి

ఏలూరు (మెట్రో): జల జీవన్ మిషన్ కార్యక్రమం కింద మంజూరైనా పనులను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఏలూరులో జలజీవన్ మిషన్, సత్యసాయి తాగునీరు ప్రాజెక్టు 2023–24 పనుల పురోగతిపై అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టమ్ కింద అప్పగించాల్సిన పనులను గ్రామ జల సంఘాలకు వెంటనే వర్క్ ఆర్డర్ ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు.

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 506 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం విధుల్లో చేరారు. వీరిలో 276 మంది అంగన్‌వాడీ టీచర్లు, 230 ఆయాలు ఉన్నారు. విధుల్లో చేరని మిగిలిన వారిని ఉద్యోగాలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలోని 10 ప్రాజెక్టుల పరిధిలో 176 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 157 మంది సహాయకులు విధుల్లో చేరినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి కేవీఎల్ పద్మావతి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 10 ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 2,011 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 1,731 మంది సహాయకులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధుల్లో చేరని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు అందిస్తామన్నారు. చాలా మంది అందుబాటులో లేకపోవడం వల్ల అంగన్‌వాడీలు విధుల్లో చేరడం తక్కువగా ఉందని, మంగళవారం విధుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతుందని ఐసీడీఎస్ అధికారులు భావిస్తున్నారు.

రూ.2.55 కోట్లతో ఏలూరు అభివృద్ధి



ఏలూరు 44వ డివిజన్‌లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే ఆళ్లనాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌యాదవ్, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ఏలూరు నగర అభివృద్ధే లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. సోమవారం నగరంలోని మూడు ప్రాంతాల్లో రూ.2.55 కోట్ల వ్యయంతో నూతనంగా చేపట్టే రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ హాజరయ్యారు. 6వ డివిజన్‌లో రూ. కోటి అంచనా వ్యయంతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. చాటపర్రు రోడ్డు నుంచి ఫిల్‌హౌస్ పేట మీదుగా కైకలూరు రోడ్డు వరకు వెళ్లే ప్రధాన రహదారిని, జూట్‌మిల్లు వంతెన నుంచి గడియార స్తంభం మీదుగా కైకలూరు రోడ్డును కలిపే ప్రధాన రహదారి, పాతబస్టాండ్ నుంచి గజ్జెలవారి చెరువు మీదుగా చాటపర్రు వెళ్లే రహదారి, పాతబస్టాండ్ నుంచి కొమడవోలు వెళ్ళే రోడ్డును నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. తొలుత చాటపర్రు రోడ్డు సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అయోధ్యలో ఆలయ నిర్మాణానికి డిజైన్ ఇచ్చింది భీమవరం వాసే



మండెల పాండు రంగారావు, విశ్రాంతి ఆచార్యులు (ప్రొఫెసర్)

ఆకివీడు: అయోధ్యలో రాములోరి ఆలయ నిర్మాణానికి డిజైన్ ఇవ్వడమే కాకుండా దగ్గరుండి కట్టించిన వ్యక్తి మన భీమవరం వాసి మండెల పాండు రంగారావు. ఆయన తల్లిదండ్రులు మండెల గోవిందరావు, మంగమ్మ. ఈయనకు ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. పాండురంగారావు ఎమ్మెస్సీ జియోటెక్నాలజీ చేసి, ప్రొఫెసర్‌గా వరంగల్‌లోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేశారు. విశ్రాంతి ఆచార్యులు(ప్రొఫెసర్)గా అక్కడే స్థిరపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలకు విలువైన పలు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రామప్పాలయం, వేయి స్తంభాల ఆలయ పునర్నిర్మాణానికి ఉపయోగించిన ఆధునిక శాండ్ బాక్స్ టెక్నాలజీని అయోధ్యలో రామాలయ నిర్మాణానికి స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాం వల్ల ఆలయం వెయ్యేళ్లపాటు చెక్కుచెదరని సూచించారు. ఆయన ఇచ్చిన ప్లాన్, డిజైన్‌పై అత్యున్నత స్థాయి సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో పరిశీలన చేసిన తరువాత ట్రస్టు, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో అయోధ్య రామాలయ నిర్మాణం వేగంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా పాండురంగారావును ఆలయ ట్రస్టు సత్కరించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అయోధ్య రాములోరి దేవాలయానికి అందజేసిన భీమవరం వాసి మండెల పాండురంగారావుకు శిరస్సు వంచి పాదాభివందనములు చేస్తున్నట్లు స్పిరుచ్యువల్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్ చెప్పారు.



కాళ్ల: శ్రీరాముని సేవలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, సుబ్బరాజు తదితరులు



పెనుగొండ : తూర్పుపాలెంలో అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ రథాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

ఊరూవాడా.. ఆధ్యాత్మిక సంబరాలు

శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో సోమవారం బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న వేళ జిల్లాలో రామాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. పలు ప్రాంతాల్లో శోభాయాత్రలు, కోలాట ప్రదర్శనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో టీవీలు, స్క్రీన్‌లు ఏర్పాటుచేసి అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని లైవ్‌లో అందుబాటులో ఉంచారు. పలు ఆలయాల్లో భక్తులు భజనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, దీపాల వెలుగులతో ప్రజల సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజలంతా టీవీల ముందు కూర్చొని బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి నెట్‌వర్క్



తణుకు అర్బన్: శోభాయాత్రలో మంత్రి కారుమూరి, రామ భక్తులు



భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో భారీ టీవీలో కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు



భీమవరం : ఆనందంతో నృత్యం చేస్తున్న ఎస్ఆర్‌కేఆర్ కళాశాల విద్యార్థులు



భీమవరం (ప్రకాశం చౌక్) : పంచారామక్షేత్రం వద్ద భజన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీటీసీ) : బలుసులమ్మ ఆలయం వద్ద సీతా సమేత రామాంజనేయులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బాస్కెట్‌బాల్ రన్నర్స్‌గా 'విష్ణు' విద్యార్థులు



బాస్కెట్‌బాల్ రన్నర్స్ విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఈనెల 20, 21 తేదీల్లో విశాఖపట్నం విజ్ఞాన్ కాలేజీలో నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్ జోనల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని కళాశాల పీడీ ఎం.శ్రీనివాసరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎం.వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు అభినందించారు.

ఏపీకి తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ పార్టీ తీవ్ర ద్రోహం చేసిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఏపీలో కనుమరుగైన ఆ పార్టీని బతికించాలనుకోవడం అంటే.. శవానికి జీవం పోయాలనుకోవడం లాంటిదే అని ఆయన చెప్పారు. తాడేపల్లిగూడెంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏపీని అడ్డగోలు విభజన చేసిందని, ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా ఏపీకి తీరని ద్రోహం చేసిన విషయం రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదని అన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిని ఎఫ్ఐఆర్‌లో చేర్చింది కాంగ్రెస్ పార్టీ వారే అని గుర్తుచేశారు. షర్మిల ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. ఏది ఏమైనా రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే గెలుపొందుతారని స్పష్టం చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు.. కాబోయే టెక్ లీడర్లు

నూజివీడు: నేటి ఇంజినీరింగ్ విద్యార్థులు రేపటి ప్రపంచాన్ని తీర్చిదిద్దే టెక్ లీడర్లని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో వినోద్‌కుమార్ ఐఏఎస్ అన్నారు. స్థానిక నూజివీడు ట్రిపుల్ ఐటీని సోమవారం సందర్శించిన ఆయన ఇండో-యూరో సింక్రనైజేషన్ కార్యక్రమంలో భాగంగా అడ్వాన్స్‌డ్ సైన్స్ క్లస్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ఈ విద్యార్థులు, అధ్యాపకులకు డేటా సైన్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మల్టీ డిసిప్లినరీ అప్రోచ్, అత్యాధునిక పద్ధతులు, ఎథికల్ డేటా హ్యాండ్లింగ్, అడ్వాన్స్‌డ్ డేటా విజువలైజేషన్, బిగ్ డేటా అనలిటిక్స్‌పై వివరించారు. రోజురోజుకు కొత్తరూపు సంతరించుకుంటున్న కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో విద్యార్థులు నిష్ణాతులుగా తయారుకావాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి చిరంజీవి, ఫైనాన్స్ అధికారి నాగార్జునదేవి, సీఎస్ఈ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి తనను కులంపేరుతో దూషించి, దుర్భాషలాడాడని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ బి.విద్య ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మహిళ తన భర్తతో విడిపోయి కుమార్తెతో స్థానికంగా ఉన్న తల్లివద్దనే ఉంటోంది. ఇంటి పక్కనే ఉన్న పఠాన్ రియాజ్‌తో పరిచయడం ఏర్పడగా వారు సహజీవనం చేస్తున్నారు. గత కొలంగా రియాజ్ తనను శారీరికంగా, మానసికంగా వేధిస్తున్నాడని, ఈ నేపథ్యంలో ఈ నెల 11న తనతో గొడవపడి, కొట్టి గాయపర్చడమే కాకుండా పాటు కులం పేరుతో దూషించాడని ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

24 నుంచి ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ పోటీలు

జేసీ బి.లావణ్యవేణి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ బి.లావణ్యవేణి

ఏలూరు (మెట్రో): జిల్లాలో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ఆడుదాం-ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి ఆటల పోటీలు నిర్వహించామని, అదేవిధంగా ఈ నెల 24 నుంచి 29 వరకు నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని, వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. దీనికి సంబంధించిన క్రీడా సామగ్రి, క్రీడాకారులకు భోజనం, వసతి, రవాణా ఏర్పాట్లను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆటల పోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను నియోజకవర్గస్థాయి కోచ్‌ల నుంచి తీసుకోవాలన్నారు. ఈ క్రీడా పోటీలకు ప్రత్యేక అధికారులుగా పోలవరం నియోజకవర్గానికి ఐటీడీఏ పీవో సూర్యతేజ, నూజివీడుకు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, చింతలపూడికి డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, ఉంగుటూరుకు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, దెందులూరుకు డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఏలూరుకు హౌసింగ్ పీడీ కేవీఎస్ఆర్ రవికుమార్‌ను నియమించినట్లు తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఉద్యోగుల వివరాలను పొందుపరచాలి

భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్నికల కమిషన్ రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపరచాలని జేసీ బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగస్తుల డేటా వివరాలలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టమైన సమాచారం పొందుపరచాలని, నెలాఖరునాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించిన పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టంపై సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పీవో ఐటీడీఏ సూర్యతేజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో భీమడోలుకు గుర్తింపు ప్రశంసనీయం



భీమడోలులో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు

భీమడోలు: జాతీయ స్థాయిలో భీమడోలు గ్రామ పంచాయతీకి గుర్తింపు తెచ్చిన సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆరోగ్యవంతమైన గ్రామం అనే అంశంపై తిరుపతిలో నిర్వహించిన జాతీయ సదస్సులో భీమడోలు గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం లభించింది. ఈ నేపథ్యంలో భీమడోలు పంచాయతీ వద్ద సోమవారం సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ దంపతులకు పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరుడు పుప్పాల కార్తీక్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలన్నింటినీ గ్రామంలో అమలు చేయడంలో ప్రత్యేక కృషి చేసిన సర్పంచ్ సేవలను వారు కొనియాడారు. పంచాయతీలో చేపట్టిన ఆరోగ్య సేవలపై లఘు చిత్రాన్ని రూపొందించి జాతీయస్థాయిలో ప్రదర్శించడంపై చాలా సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో భీమడోలుకు ప్రత్యేక గుర్తింపు రావడం మరవలేని ఘట్టమన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించాలని నాయకులు కోరారు. సన్మాన గ్రహీత పాము సునీతామాన్‌సింగ్ మాట్లాడుతూ డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, గ్రామ కార్యదర్శి నందేటి ఠాగూర్, సంబంధిత అధికారుల సహకారాలు మరువలేనివన్నారు. భీమడోలు పంచాయతీ తన హయాంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంద్రిగ నరసింహపురం సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మన్యంలో పులి సంచారం..?

- ఎర్రాయిగూడెం చెరువు సమీపంలో పులి పాదముద్రలు!
- భయాందోళనలు చెందుతున్న గ్రామస్తులు
- పులి పాదముద్రలు కావంటున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం ఐటీడీఏ సమీపంలో ఎర్రాయిగూడెం గ్రామం వెళ్లే రహదారిలో ఉన్న చెరువు వద్ద సోమవారం పులి పాద ముద్రలను గ్రామస్తులు గుర్తించారు. దీంతో భయాందోళన చెంది ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులు అక్కడకు చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. అయితే తడి ప్రదేశంలో ఈ పాదముద్రలు ఉండడం వల్ల సరిగ్గా గుర్తించలేకపోతున్నట్లు ఫారెస్టు రేంజ్ అధికారి కృష్ణకుమారి తెలిపారు. అవి పులి ముద్రలు మాత్రం కాదు అని స్పష్టం చేశారు. పరిసర ప్రాంత ప్రజలు భయందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ పరిసర ప్రాంతంలో ఎక్కడా జంతువులపై పులి దాడి చేసిన సంఘటనలు జరగలేదని వివరించారు. ఈ నేపథ్యంలో ఆ పాదముద్రలు ఏ జంతువువి అని గుర్తించేందుకు ఉన్నతాధికాలకు పాదముద్ర గుర్తులను పంపించినట్లు చెప్పారు. కాగా పులి సంచారం వార్త వ్యాపించడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆ పరిసర ప్రాంతంలోని ఉన్న పొలాలకు వెళ్లే రైతులు భయపడుతున్నారు.





పొలాల్లో పులిసంచార ప్రదేశాలను పరిశీలిస్తున్న గ్రామస్తులు , ఎర్రాయిగూడెం చెరువు సమీపంలో గ్రామస్తులు గుర్తించిన పాదముద్రలు

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



కృష్ణ కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేస్తున్న తెన్నేటి జగ్జీవన్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 13వ వార్డు మాజీ కౌన్సిలర్ దొడ్డిగర్ల కృష్ణ (45) అనారోగ్యంతో సోమవారం విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగజ్జీవన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు వార్డు ఇంచార్జ్ జగజ్జీవన్‌చే వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు కృష్ణ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ ఎస్.సూర్య, వెల్ఫేర్ సెక్రటరీ రాజ్‌కుమార్, వలంటీర్ జ్యోతిలు తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యం



వీరంపాలెం గ్రామంలో చిరుధాన్యాలతో వంటకాలు తయారు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పెరటి తోటల పెంపకం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా సోమవారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులతో పెరటి తోటల పెంపకం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ రాజ్‌నాయక్ మాట్లాడారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ పెరటి తోటల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించుకోవాలన్నారు. హోం సైన్స్ సైంటిస్ట్ డాక్టర్ డెబోరా మెస్సియానా, డాక్టర్ వినయలక్ష్మి మహిళా రైతులకు చిరు ధాన్యాలతో రకరకాల వంటలు వండి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ జి.రమేష్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ నిర్మాణానికి అంతా సహకరించాలి



వెంకట్రావుపాలెం గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్య సమాజ నిర్మాణానికి అంతా సహకరించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రావుపాలెం, అప్పారావుపేట గ్రామాల్లో క్షేత్ర స్థాయి ఆరోగ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల లార్వాలను గుర్తించడంలో మెళకువలను ప్రజలకు వివరించారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించడం ద్వారా దోమల నుంచి వచ్చే వ్యాధులను అరికట్టవచ్చాన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి పరిశుభ్రతపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఝాన్సీ, ఎంఎల్‌హెచ్‌పీ రూత్, ఆరోగ్య సహాయకులు భాస్కరరావు, కాంతారావు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మసాక్షాత్కారంతో భగవంతునికి చేరువ



అనుగ్రహ భాషణం చేస్తున్న ఉమర్ ఆలీషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేను ఎవరు అని ప్రశ్నించుకుని ఆత్మను సాక్షాత్కారింప చేస్తే భగవంతునికి చేరువ అవుతామని పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఉద్బోధించారు. కొబ్బరితోటలోని శ్రీదేవి మహంకాళమ్మ ఉత్సవాల్లో భాగంగా వార్షిక జాతరలో 8వ రోజు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ నాగబాబు ఆధ్వర్యంలో సోమవారం ఆలీషా ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను యూనియన్ సభ్యులు, తదితరులు పర్యవేక్షించారు.

పథకాలతో.. అందరికీ లబ్ధి

- నాలుగేళ్లలో మూడు లక్షల 60వేల 191 మందికి లబ్ధి
- ఒక్కొక్కరికి సరాసరి రూ.30 వేల లబ్ధి



తాడేపల్లిగూడెంలో సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ (ఫైల్)

తాడేపల్లిగూడెం: ప్రజలందరి అభివృద్ధితో పాటు మహిళా సాధికారిత, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా వారికి అన్ని విధాలా అండగా నిలుస్తూ చేయూత అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పలువురి జీవితాలకు ఆసరా దక్కింది. మీకు మేమున్నామనే భరోసా వచ్చింది. అయోమయంలో ఉన్న కుటుంబాలకు చేయూత, బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచించే వారికి చల్లని అమ్మ ఒడి చేరువైంది. చక్కని గూడు నీడ నిచ్చింది. రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో బాధపడుతున్న హృదయాలకు స్వాంతన దొరికింది. ఒక్క తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మూడు లక్షల 60వేల191మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక్కొక్కరిగా సరాసరి 30వేల రూపాయల వంతున సాయం అందింది. సుమారు 1,079 కోట్ల 34 లక్షల 61వేల 740 రూపాయలు సంక్షేమం కింద అర్హులకు అందింది. ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష నగదు బదిలీల కింద లబ్ధిదారులకు ఒక ఎకరం సాగుభూమి ఉంటే ఏటా పంట చేతి కందినట్లు పథకాల సొమ్ములు అందుతున్నాయి. అల్పాదాయ, పేద కుటుంబాలకు సంతోషం చిరునామాగా మారింది.

అందరి ముఖంలో ఆనందం

నియోజకవర్గ జనాభా 2,62,620, వీరిలో ఓటర్లు 2,10,395 మంది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో నవరత్నాలతో పాటు, సుమారు మరో 30 పథకాల ద్వారా నేరుగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నవారు జనాభాలో సగానికి పైగా ఉన్నారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలం, పెంటపాడు మండలాల్లో కలిపి సుమారు మూడు లక్షల 60వేల 191 మందికి ఇప్పటి వరకు 1,079 కోట్ల 34లక్షల,61వేల 740 రూపాయలకు పైబడి లబ్ధిని పొందారు. తలసరి లెక్కన చూసుకుంటే ఒక్కొక్కరికి ఏదో రూపంలో 30వేల రూపాయల వంతున లబ్ధి కలుగుతోంది. అర్హులు అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

లబ్ధిదారులు– సాయం

తాడేపల్లిగూడెం మున్సిపాల్టీలో 28 ప్రత్యక్ష నగదు పథకాలు, ఏడు పరోక్ష నగదు బదిలీ పథకాల కింద ఈ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 1,58,802 మంది లబ్ధిదారులకు 3,19,66,27,004 రూపాయల లబ్ధి కలిగింది. తాడేపల్లిగూడెం మండలంలో 201389 మంది లబ్ధి దారులకు 5,13,90,85,613 రూపాయల ప్రయోజనం కలిగింది. పెంటపాడు మండలంలో 83,330 మంది లబిబ్ధిదారులకు 2,45,77,49,123 కోట్ల రూపాయల విలువైన పథకాల లబ్ధి అందింది.

ఎన్నోరకాల సాయాలు

జగనన్న అమ్మ ఒడి నుంచి వసతిదీవెన, విద్యా దీవెన, విదేశీ విద్యా దీవెన, రైతుభరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ, మత్స్యకార భరోసా, సున్నావడ్డీ, పెన్షన్ కానుక, చేయూత, ఆసరా, బీమా, కాపునేస్తం, నేతన్న నేస్తం,చేదోడు, లా నేస్తం, వాహన మిత్ర, ఆరోగ్య ఆసరా, అర్చకులకు సాయం, కోవిడ్ సాయం, కల్యాణమస్తు, షాదీతోఫా, హౌసింగ్ వంటి ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు, జగనన్న తోడు, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, విద్యాకానుక, కంటి వెలుగు, ఇండ్ల స్థలాలు, ట్యాబ్‌ల పంపిణీ వంటి పథకాల లబ్ధి కలిగింది. ఎన్నో సాయాలు అందాయి.

అమ్మ ఒడి ఆదుకుంది



అల్పాదాయ కుటుంబానికి చెందిన మాకు అమ్మ ఒడి ఆదుకుంది. రెండేళ్లుగా ఈ సొమ్ములు రావడంతో పాపను మంచిగా చదివించుకోగలుగుతున్నాం. ఆరోగ్యశ్రీ కూడా మా కష్టాలను తీర్చింది. మీ లాంటి సీఎం గతంలో ఎన్నడూ చూడలేదు. మా పిల్లలను స్కూల్‌కు పంపితే అన్ని ఇస్తున్నారు. గవర్నమెంట్ స్కూల్‌లో చదివిస్తున్నానని గర్వంగా చెబుతున్నా. మా ఇంట్లో రేషన్ బియ్యం తింటాం. రేషన్ బండి ఇంటి ముందుకే వస్తోంది. ఏ ప్రయాస లేకుండా సరుకులు తీసుకుంటున్నాం.

– సమయం మధు కల్యాణి , తాడేపల్లిగూడెం

పింఛన్ అందుతోంది



ఎన్నో ఏళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూశాను. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం తిరిగి తిరిగి అలిసిపోయా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోగానే పింఛన్ మంజూరైంది. ఒక ఆడపిల్లకు అన్నగా మీరు(సీఎం జగన్)చేయాల్సిందంతా చేశారు. ఇంతకంటే ఏం కావాలి? కరోనా సమయంలో ఎంతో ఆదుకున్నారు. మళ్లీ మీరే మాకు సీఎంగా రావాలి.

- కొంకి లక్ష్మి , తాడేపల్లిగూడెం, పాతూరు

చేయూత అందింది



మీ సంకల్పం గట్టిది. మీరు తెచ్చిన సచివాలయాల వ్యవస్థతో రూపాయి ఖర్చు పెట్టకుండా అన్ని సహాయాలు అందుతున్నాయి. ఏ పథకం కావాలన్న సులభంగా అందుతోంది. మా అత్తయ్యకు చేయూత వస్తోంది. పేద మహిళ లక్షాధికారి కావాలన్న మీ(సీఎం జగన్) సంకల్పం గొప్పది. మీ ద్వారా నా కుటుంబం 55,000 వరకు లబ్ధి పొందాం. సీఎం జగన్ గారికి ధన్యవాదములు. సంక్షేమ పథకాలతో అందరూ అభివృద్ధి చెందుతున్నారు.

–పెదముత్తి మరియమ్మ , పుల్లాయిగూడెం తాడేపల్లిగూడెం మండలం

గూడు దొరికింది



మాకు గత 20ఏళ్లుగా నిలువ నీడ లేదు. జగన్ బాబు వచ్చాక మాకు ఇంటి స్థలం వచ్చింది. దానికి తోడు కట్టుకోవడానికి కూడా సాయం చేశారు. ఎన్ని జన్మలెత్తినా మీ(సీఎం జగన్) రుణం తీర్చుకోలేం. కాలనీలో కరెంటు, రోడ్లు, వాటర్ అన్ని సౌకర్యాలున్నాయి. అప్పట్లో శ్రీకృష్ణుడు ద్వారక కట్టిస్తే అన్ని కులాలు కలిసి బతికేవారట. ఇప్పుడు జగనన్న కాలనీలు కూడా ద్వారక లాంటివే. మీ లాంటి సీఎంను గతంలో ఎన్నడూ చూడలేదు.

-కొయ్య కన్నమ్మ , వెంకట్రావు పాలెం, తాడేపల్లిగూడెం మండలం

విధుల్లో చేరిన 69 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు



తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

తణుకు టౌన్: తణుకు ఐసీడీఎస్ పరిధిలో సమ్మె చేస్తున్న 38 మంది కార్యకర్తలు, 31 మంది ఆయాలు సోమవారం సమ్మెను విరమించి తమ విధులలో చేరినట్లు ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదిని కుమారి తెలిపారు. గత 43 రోజులకు పైగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వం విధుల్లో చేరమని కోరినా పట్టించుకోకపోవడంతో సోమవారం విధుల్లో చేరమని ఆదేశించింది. దీనితో తణుకు నియోజకవర్గ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో మొత్తం 230 మంది కార్యకర్తలకు గానూ 38 మంది విధుల్లో చేరగా మరో ఇద్దరు మెడికల్ లీవుల్లో ఉన్నట్లు తెలిపారు. అలాగే మొత్తం 222 మంది ఆయాలకు గానూ 31 మంది మాత్రమే సోమవారం విధుల్లో చేరినట్లు తెలిపారు.

విధుల్లోకి చేరిన అంగన్‌వాడీలు

తాడేపల్లిగూడెం: సమ్మె బాటను వీడి నియోజకవర్గంలో అంగన్‌వాడీలు , ఆయాలు కొందరు సోమవారం విధుల్లోకి చేరారు. పెంటపాడు మండలంలో 74 అంగన్‌వాడీ కేంద్రాలు, నాలుగు మినీ కేంద్రాలు ఉన్నాయి. 26 కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు చేరారు. మినీ కేంద్రాలు నాలుగింటిలో రెండు కేంద్రాల్లో మాత్రమే ఉద్యోగులు విధుల్లోకి వచ్చారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 60 కేంద్రాలుండగా, 13 మంది టీచర్లు, 09 మంది ఆయాలు విధుల్లోకి చేరారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. మాసోత్సవాల్లో భాగంగా బస్సులు మెయింటెనెన్స్‌పై పలు సూచనలు, సలహాలను డ్రైవర్లు ద్వారా మేనేజర్ స్వీకరించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన బుధవారం థాంక్స్ గివింగ్ డేను నిర్వహిస్తున్నామన్నారు.

అంతా రామమయం

- వైభవంగా శోభాయాత్ర
- గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు



తణుకు టౌన్: తేతలిలో ఆంజనేయ మాలధారుల గ్రామోత్సవం దృశ్యం



తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరులో సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

తణుకు టౌన్: ప్రతి భారతీయుడూ గర్వించేలా అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలోని బాల రాముని విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజలు ఎల్ఈడీలు, టీవీల్లో తిలకించారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని రామాలయాల్లో రామస్మరణతో మార్మోగాయి. తణుకు మండలంలోని పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తేతలి, వేల్పూరు, దువ్వ తదితర గ్రామాల్లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలు, శ్రీ సీతారాముల ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామాల్లో జై శ్రీరామ్ నినాదాలతో గ్రామోత్సవాలను నిర్వహించారు.

బలుసులమ్మ ఆలయం వద్ద 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రామ జన్మభూమి అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు, ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద సోమవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వెల్లవలపల్లి ప్రదీప్ శర్మ బ్రహ్మత్వంలో సీత సమేత రామాంజనేయులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వట్టిప్రోలు రాము, పెదప్రోలు భాస్కర్, గార్లపాటి వీరకుమార్, గుంటబోయిన రామస్వామి, వానపల్లి ధన నాగ ప్రసాద్, నున్న రంగనాయకులు, బలుసులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు. సుబ్బారావుపేట శేషమహల్ వద్ద సాలిపేట రామాలయంలో శ్రీరామునికి వ్యాపారస్తులు విశేష పూజలు నిర్వహించారు. పాతూరు రామాలయం వద్ద శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు, ప్రవచనాలు, పారాయణాలు, అన్నసమారాధనలు జరిగాయి. ఆలయ ధర్మకర్త కర్రి సీతారామయ్య, ధనబాబు, దాట్ల జగన్నాధరాజు, పాతూరు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. నల్లజర్ల రోడ్డులోని శ్రీ శ్రీనివాస గోడౌన్స్ వద్ద అభయ ఆంజనేయ స్వామి, లక్ష్మీగణపతి దివ్య ప్రతిష్ఠ మహోత్సాలు వైభవంగా నిర్వహించారు. బాల రాముని అక్షింతలు, ప్రసాదాలు అందజేశారు. బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, పట్టణ ప్రముఖులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రీరామరక్ష స్తోత్రం, హనుమాన్ చాలీసా, ఊరేగింపులు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



ఇరగవరం: తూర్పు విప్పర్రులో ర్యాలీ చేస్తున్న భక్తులు



అత్తిలి: రాములవారిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ

గ్రామాల్లో ఊరేగింపులు

ఇరగవరం: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో వాడవాడలా శోభాయాత్రలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, సీతా రాముల శాంతి కల్యాణాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గుడిమెట్ల ఆది లక్ష్మీ , జుత్తిగ గాయిత్రీ దేవి, పోతుల గంగాధర్, కఠారి చంద్ర మణి, నాయకులు గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, జుత్తిగ కిషోర్ , ఘంటా అప్పారావు, సొసైటి అధ్యక్షులు చవ్వాకుల శ్రీనివాస్, మల్లి రెడ్డి నాగార్జున, సైపురెడ్డి పెద్ది రాజు, పెన్మెత్స రామ భద్రా రాజు, మాజీ సర్పంచ్ ఆకేటి నరసింహరావు, అడాబాల శివ శంకర వరప్రసాద్, దివ్య నాగ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి

అత్తిలి: అయోధ్యలో రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా మండలంలోగల రామాలయాల వద్ద రామనామ జపంతో మారుమ్రోగాయి. శ్రీరాముని చిత్రాలతో కూడిన కాషాయ జెండాలను చేతబట్టుకుని రామనామాన్ని జపిస్తూ, కోలాటాల నృత్యాలు చేస్తూ ఊరేగింపు ఉత్సవాలను జరిపారు. యువకులు శ్రీరాముడు, ఆంజనేయస్వామివార్ల వేషధారణలు ధరించి శ్రీరాముని శోభాయాత్రలో పాల్గొన్నారు. అత్తిలిలో గల శ్రీరామాలయంలో నిర్వహించిన అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురష్కరించుకుని రామాలయంలో ఏర్పాటు చేసిన రామమందిరాన్ని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకున్నారు. శ్రీరాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, కూనపరెడ్డి జయరాజు, ఆకుల చినబాబు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల

తాడేపల్లిగూడెం: అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాను సోమవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏ.దుర్గేష్ విడుదల చేశారు. తాడేపల్లిగూడెం మొత్తం ఓటర్లు 87,196, తాడేపల్లిగూడెం రూరల్ మండలం మొత్తం ఓటర్లు 70,206, పెంటపాడు మండలం మొత్తం ఓటర్లు 56,320మంది ఉన్నారు. నియోజకవర్గంలో 209 పోలీంగ్ కేంద్రాల యందు ప్రచురణ చేయడం జరిగిందని దుర్గేష్ తెలిపారు. ఈ జాబితాను అనుసరించి గూడెం నియోజకవర్గ ఓటర్లు మొత్తం 2 లక్షల 13 వేల 722 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,04,391 కాగా, మహిళలు 1,09,323 మంది ఉన్నారు. ఇతరులు ఎనిమిది ఉన్నారు. వీరి వివరాలను 209 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించనున్నారు. జాబితా విడుదల కార్యక్రమంలో ఆర్డీఓ కె.చెన్నయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ శివశంకర్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గూడెం నియోజకవర్గ ఓటర్ల వివరాలను చెబుతున్న ఎన్నికల అధికారి దుర్గేష్, ఆర్డీఓ కె.చెన్నయ్య



తణుకులో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి బీవీ రమణ, తదితరులు

ఓటర్ల తుది జాబితా ప్రకటన

తణుకు టౌన్: 2024 ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. ఓటర్ల జాబితాలను బూత్ స్థాయి అధికారులు సంబంధిత పంచాయతీ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల సవరణలు, మార్పుల కోసం ఈనెల 12వ తేదీ వరకు అవకాశం కల్పించింది. సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్‌లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గానికి సంబంధించి తుది ఓటరు జాబితాలను పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. తణుకు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 233 పోలింగ్ బూత్‌ల వద్ద ఈ జాబితాలను సిద్ధం చేశామన్నారు. తణుకు నియోజకవర్గంలో మొత్తం 2,33,082 మంది కాగా వారిలో పురుష ఓటర్లు 1,13,780 మంది కాగా మహిళా ఓటర్లు 1,19,296 మంది, ఇతరులు 6గురు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్‌లతో పాటు ఇరగవరం, అత్తిలి, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, టీపీవోలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రిత్విక్‌రెడ్డికి అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ) :ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా క్రీడాకారుడు, భారతీయ విద్యాభవన్స్‌లో నాల్గోవ తరగతి విద్యార్థి సత్తి రిత్విక్ రెడ్డి అండర్ నైన్ విభాగంలో తృతీయ స్థానం సాధించారు. మాస్టర్స్ చెస్ అకాడమీ చైర్మన్ సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, కోచ్, సెక్రటరీ ఎస్.ఎస్.చంద్రశేఖర్, తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ జీవీ కుమార్ తదితరులు అభినందించారు.



తృతీయ స్థానం సాధించిన రిత్విక్‌రెడ్డి

సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

తణుకు అర్బన్: సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 7వ వార్డులో రూ. 25 లక్షలతో ప్రెస్‌క్లబ్ భవనం, రూ. 25 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలును మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తణుకు నియోజకవర్గానికి సంబంధించి జర్నలిస్టుల అభ్యర్ధన మేరకు ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మాణం చేయించామని భవనంలో కావాల్సిన సదుపాయాలను సైతం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని అర్థం చేసుకోవాలని కోరారు. బీసీల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లోను అత్యంత ప్రాధాన్యనిచ్చిన విషయం తెలిసిందేనని చెప్పారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ జర్నలిస్టులు సాంకేతికంగా వస్తున్న మార్పులను ఆకలింపు చేసుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, డీఈఈ కొవ్వూరి ఈశ్వర రెడ్డి, ఏఈలు డి.రామకిషోర్, ఇ.లక్ష్మి శిరీష, సీనియర్ జర్నలిస్టులు బెల్లంకొండ బుచ్చిబాబు, పిర్ల కృష్ణమూర్తి, అన్యం శ్రీనివాస్, కొడమంచిలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తూర్పు కాపు సంక్షేమ సంఘ అధ్యక్షులు సామంతుల అప్పారావు, వార్డు ఇన్‌చార్జ్‌డీజెఅమ్మ్యాలారావు , కార్యదర్శి డోలా సింహాద్రి, కోశాధికారి ఇ.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబరు తాడేలు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



రేలంగిలో అభయ ఆంజనేయుని స్వామి విగ్రహనికి పూజలు చేస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంకా

ఇరగవరం: మండలంలోని రేలంగిలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. సోమవారం రేలంగిలో ఉయ్యాల స్థంభం వద్ద భక్తుల విరాళాలతో ఏర్పాటు చేసిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహన్ని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతున్న ఈ రోజు రేలంగిలో ఆంజేయ స్వామి విగ్రహం ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పులుపు అనిల్ దంపతులు, శిరిగినీడి శివరామ కృష్ణ దంపతులు, గాంధీ, వేంకటేశ్వరరావు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, నాయకులు పులుపు సునీల్, చేబ్రోలు పెద్దిరాజు, వడ్డే మార్కేండేయులు ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.